

భాస్కర్ రావు, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త ఖ×మీా ఆసుపత్రి సముదాయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయన ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.
హైదరాబాద్, మే 4 (నినాదం):



మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రుల వ్యవస్థాపకులు డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి 30వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రిని డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి ఆహ్వానించారు.
హైదరాబాద్, మే 4 (నినాదం):


www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

సోమవారం మే 04 2026

ninadam.in

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్


# ద్రవిడ కోటను బద్దలుకొట్టిన విజయ్..

## ఆరు దశాబ్దాల చరిత్రకు బ్రేక్

- తమిళనాడు ఎన్నికల్లో సంచలనం సృష్టిస్తున్న నటుడు విజయ్ పార్టీ
- అధికారానికి చేరువలో తమిళగ వెట్రి కళగం (టీవీకే)
- ఆరు దశాబ్దాల డీఎంకే, ఏఐఏడీఎంకేల పాలనకు ముగింపు సంకేతాలు
- అధికార డీఎంకేకు ఊహించని భారీ పరాజయం
- కొన్ని ప్రాంతాల్లో బలపడిన ఏఐఏడీఎంకే



**చెన్నై, మే 4 (నినాదం) :**
తమిళనాడు రాజకీయాల్లో ఒక ఊహించని బ్లాక్‌బస్టర్... ఎవరూ అంచనా వేయని ఒక అద్భుతమైన స్క్రిప్ట్ ఆవిష్కృతమైంది. ఆరు దశాబ్దాలకు పైగా ద్రవిడ పార్టీల ఆధిపత్యంలో ఉన్న రాజకీయ చరిత్రను తిరగరాస్తూ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) చారిత్రక విజయం దిశగా దూసుకెళుతోంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి, అధికారాన్ని కైవసం చేసుకునే అంచున నిలిచి, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

**వ్యూహాలు.. ఫలితాలు**
2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మధ్యాహ్నం 1 గంట సమయానికి టీవీకే రాష్ట్రంలోని మొత్తం 234 స్థానాలకు గానూ 107 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మేజిక్ ఫిగర్‌కు కేవలం 11 సీట్ల దూరంలో నిలిచింది. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ద్రవిడ దిగ్గజాల మధ్య నూతన శక్తిగా బరిలోకి దిగిన టీవీకే, అందరి అంచనాలను తలకిందులు చేసింది. 1962లో కె. కామరాజ్ నేతృత్వంలోని

02



## బెంగాల్‌లో భాజపా సంచలన విజయం

## 2021 పరాజయం తర్వాత వ్యూహ మార్పు

# దీదీ కంచుకోటను బద్దలుకొట్టిన కమలం

*టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈసారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు.*


- సునీల్ భన్సల్ నేతృత్వంలో సంస్థాగత పునర్వ్యవస్థీకరణ
- బూత్ స్థాయిలో పటిష్ట ప్రణాళికలు
- అమిత్ షా ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రచారం
- రికార్డ్ స్థాయి పోలింగ్ భాజపాకు లాభం
- హిందూ ఓటర్ల ఏకీకరణపై దృష్టి
- మమతపై కాకుండా ఎమ్మెల్యేలపై టార్గెట్
- పరివర్తన్ యాత్రతో ప్రజల్లోకి చేరిక
- ఆకర్షణీయ హామీలతో ఓటర్లను ఆకట్టుకోవడం
- కేంద్ర బలగాల మోహరింపుతో మారిన సమీకరణాలు
- మహిళలు, యువత, రైతులపై దృష్టి సారించిన మేనిఫెస్టో
- సరిహద్దు భద్రత, చొరబాట్లపై కఠిన వైఖరి
- కేంద్ర నేతల విస్తృత ర్యాలీల ప్రభావం

**కోల్‌కత్తా, మే 4 (నినాదం) :**
ఎదురుదెబ్బలను విశ్లేషించుకొని..
2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిందులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77

02

## ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు...

'కమలం' మ్యాప్‌ను షేర్ చేసిన బీజేపీ




భారతదేశం 'మోదీమయం' అంటూ ట్వీట్

ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని వ్యాఖ్య

## కేంద్ర పథకాల అమలుపై సమగ్ర సమీక్ష

# రాష్ట్ర పనితీరుకు కేంద్ర ప్రశంసలు



**హైదరాబాద్, మే 4 (నినాదం) :**
కేంద్ర కార్యదర్శి సుధాన్ష్ పంత్ సచివాలయంలో రాష్ట్ర అధికారులతో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలును సమీక్షించారు. స్కాలర్‌షిప్‌లు, పౌర హక్కుల పరిరక్షణ, హాస్టళ్లు, ట్రాన్స్‌జెండర్ల పునరావాసం, నమస్తే పథకం వంటి కీలక సంక్షేమ కార్యక్రమాల పురోగతిని అభినందిస్తూ, వాటి ప్రభావాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తూ సమీక్షించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ రాష్ట్ర పనితీరును వివరించి, కేంద్రం నుండి మరింత మద్దతు కోరారు. భారత ప్రభుత్వ కేంద్ర

02



'జవహర్ నగర్ డంప్ యార్డ్ వ్యతిరేక జేఏసీ' సభ్యులు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ భేటీలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ జజజ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ శంకర్ నారాయణ మరియు ఇతర జేఏసీ నాయకులు పాల్గొన్నారు. జవహర్ నగర్ డంప్ యార్డ్‌ను వేరే చోటికి తరలించాలని ఈ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కోరింది.
హైదరాబాద్, మే 4 (నినాదం):



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వెం టెక్నాలజీస్ డిఫెన్స్ ఇండస్ట్రీ వ్యవస్థాపకులు, సీఎండీ వి. వెంకట రాజు జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ నిమ్జ్‌లో కొత్త యూనిట్ ఏర్పాటుకు సహకరించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
హైదరాబాద్, మే 4 (నినాదం):

# ఒమన్‌లో చిక్కుకున్న ఏపీ మహిళ..

## సురక్షితంగా రప్పిస్తున్న ప్రభుత్వం

- 'నన్ను కాపాడండి' అంటూ పవన్ కల్యాణ్‌కు వీడియో సందేశం
- వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం కార్యాలయం, ఏపీ ప్రభుత్వం



**అమరావతి, మే 4 (నినాదం) :**
ఉపాధి కోసం ఒమన్ వెళ్లి, అక్కడ యజమాని వేధింపులకు గురై నిర్బంధంలో చిక్కుకున్న ఏపీకి చెందిన మహిళను రాష్ట్ర ప్రభుత్వం సురక్షితంగా వెనక్కి తీసుకొస్తోంది. అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన దుదేకుల షెహనాజ్, ప్రభుత్వ జోక్యంతో ఈ నెల 7న తిరిగి సొంతూరుకు రానున్నారు. ఏపీ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్‌ఆర్‌టీఎస్), డిప్యూటీ సీఎం

02



# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం
- శనగ పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు ఏవీ
- సదాశివపేటలో రైతులను పరామర్శించిన కేటీఆర్

**సంగారెడ్డి, మే 4 (నినాదం) :**
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం

02

# దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

- స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



**కరీంనగర్, మే 4 (నినాదం) :**
దేశమంతా ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్

02

# తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం



- ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టు
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

**హైదరాబాద్, మే 4 (నినాదం) :**
తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి బుద్ధి చెప్పారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఈ ఫలితాలను చూస్తే తెలంగాణలోనూ భాజపా అధికారంలోకి వస్తుందనేది స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. గత 33 ఏళ్లు కమ్యూనిస్టులు, 15 ఏళ్లు

02

# సింగపూర్ బాటలో ఏపీ ఉపాధ్యాయులు..

## విద్యారంగంలో ప్రపంచస్థాయి ప్రమాణాలే లక్ష్యం

- 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సింగపూర్‌లో అంతర్జాతీయ శిక్షణ
- ముఖ్యమంత్రి 'ఫ్యూచర్ రెడీ' విజన్‌లో భాగంగా కీలక కార్యక్రమం
- పాఠశాల విద్యలో ప్రపంచస్థాయి ప్రమాణాలు తీసుకురావడమే లక్ష్యం
- శిక్షణ తర్వాత టీచర్లు మెంటార్లుగా మారి తోటి ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం
- తదుపరి బృందాన్ని ఫిన్‌లాండ్‌కు పంపేందుకు ప్రభుత్వ ప్రణాళిక

**అమరావతి, మే 4 (నినాదం) :**
ఏపీ పాఠశాల విద్యారంగంలో సరికొత్త శకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేవలం మౌలిక వసతుల కల్పనకే పరిమితం కాకుండా, బోధనా నాణ్యతను ప్రపంచస్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఒక బృహత్తర కార్యక్రమానికి అడుగులు వేసింది. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని అత్యుత్తమ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ వేదికలపై శిక్షణ ఇప్పించి, వారిని గ్లోబల్ ఎడ్యుకేషన్ లీడర్లుగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిలో 37 మందిని 'అంతర్జాతీయ శిక్షణా పర్యటన'కు ఎంపిక చేశారు. సీఎం చంద్రబాబు 'ఫ్యూచర్ రెడీ' దార్శనికతకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వానికి ఈ కార్యక్రమం అద్దం పడుతోంది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై ఎవరితోనైనా పోటీపడగల సత్తా సాధించాలని, అందుకు పాఠశాల స్థాయిలోనే బలమైన పునాది పడాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

02




## తమిళనాడులో విజయ్ గెలుపుపై స్పందించిన కవిత

- రాజకీయ చరిత్రను తిరగరాసేందుకు కొత్త శక్తులు అవసరమన్న కవిత
- ఈ విషయాన్ని తమిళ ప్రజలు నిరూపించారన్న కవిత
- ఈ దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపించారని వ్యాఖ్య




**హైదరాబాద్, మే 4 (నినాదం):**
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) పార్టీ అధినేత్రి కవిత స్పందించారు. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరమని తమిళ ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఉన్న వాళ్లతో విసిగిపోయాం. అధికార దాహార్తులతో వేసారిపోయాం. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి 'కొత్త రాజకీయ శక్తులు' అవసరమని దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపారు" అని ట్వీట్ చేశారు. కవిత కూడా పది రోజుల క్రితం తన కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ శక్తుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని అభిప్రాయపడ్డారు. సాయంత్రం 4.30 గంటల సమయానికి టీవీకే పార్టీ 24 స్థానాల్లో నెగ్గి, 82 చోట్ల ఆధిక్యంలో ఉంది. అధికార డీఎంకే 13 స్థానాల్లో నెగ్గి, 58 సీట్లలో ముందంజలో ఉంది. అన్నాడీఎంకే 10 సీట్లు గెలుచుకుని, 46 స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది.

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

## సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి
- రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ
- పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి



**అమరావతి, మే 4 (నినాదం) :**
ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల'

02

EVENING 6 PM 02

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

డిజిటల్ ఎడిషన్

సోమవారం మే 04 2026 ninadam.in

# సింగపూర్ బాటలో ఏపీ ఉపాధ్యాయులు..

**సింగపూర్‌లో ప్రత్యేక శిక్షణ**

ఈ చొరవలో మొదటి దశగా 37 మంది ఉపాధ్యాయులతో కూడిన బృందం సింగపూర్‌కు బయలుదేరింది. అక్కడ ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎన్ఐఈ)లో మే 4 నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజుల పాటు "డిజైనింగ్ లెర్నింగ్, ఇన్‌స్పైరింగ్ థింకింగ్" అనే అంశంపై ప్రత్యేక శిక్షణ తీసుకోనుంది. విద్యా విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలను అనుసంధానించాలన్న మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో సింగపూర్ ఎన్ఐఈ, ఫిన్‌లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కు వంటి సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు కుదిరాయి. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులను కేవలం సమాచారం అందించేవారిగా కాకుండా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను ప్రేరేపించే అభ్యాస మార్గదర్శకులుగా మార్చడమే ప్రధాన ఉద్దేశం.

**పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ**

ఈ బృందం ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తిగా మెరిట్ ఆధారంగా జరిగింది. ఇందులో 10 మంది ప్రధానోపాధ్యాయులు, 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ప్రిన్సిపాల్స్, ఐదుగురు ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో 17 మంది మహిళలు ఉండటం గమనార్హం. శిక్షణలో భాగంగా సింగపూర్ విద్యా వ్యవస్థ, బోధనా రూపకల్పన పద్ధతులు, యిషున్ సెకండరీ స్కూల్ సందర్శన వంటి అంశాలపై వీరికి అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ… "ముఖ్యమంత్రి మార్గనిర్దేశంలో, విద్యాశాఖ మంత్రి పర్యవేక్షణలో ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. ఇది కేవలం పర్యటన కాదు, మన విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పునకు నాంది. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయికి చేర్చేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఉంది" అని వివరించారు.

**స్థానిక పాఠశాలల్లో అమలు**

శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తారు. అంతేగాక తోటి ఉపాధ్యాయులకు మెంటార్లుగా వ్యవహరించి, తాము నేర్చుకున్న ప్రపంచస్థాయి పద్ధతులను రాష్ట్రవ్యాప్తంగా తరగతి గదుల్లోకి తీసుకెళతారు. ఈ కార్యక్రమం తర్వాత మరో 29 మంది ఉపాధ్యాయులతో కూడిన తదుపరి బృందాన్ని ఫిన్‌లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కుకు పంపేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం బలమైన పునాది వేస్తోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం

తృణమూల్ పాలించిన బెంగాల్ కోటలో భాజపా విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అస్సాంలో మూడోసారి భాజపా కూటమి అధికారంలోకి వస్తోందన్నారు. కుటుంబ రహిత, అవినీతి రహిత పాలన అందించాం కాబట్టే.. అస్సాంలో మళ్లీ తమ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఉత్తరాది, దక్షిణాది వైషమ్యాలు సృష్టించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మైనార్టీలు భాజపాలో చేరారని.. ముస్లిం మహిళలు మోదీని పెద్దన్నగా భావిస్తున్నారన్నారు. మే 10న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

## దేశమంతా డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం

పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనని ఎద్దేవా చేశారు. కేరళంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేనని బండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణం యాజమాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని అన్నారు.

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..

ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు. సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026-27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాలన్నారు. 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాలు-పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేరళలో వామపక్ష పాలనకు తెర.. కాంగ్రెస్ కూటమి ఘన విజయం

- **కేరళలో పదేళ్ల వామపక్ష పాలనకు ముగింపు**
- **కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి స్పష్టమైన మెజారిటీ**
- **దేశంలో కమ్యూనిస్టుల పాలనలో ఉన్న చివరి రాష్ట్రం కూడా పరాజయం**
- **ప్రభుత్వ వ్యతిరేకతే ఎల్డీఎఫ్ ఓటమికి కారణమని విశ్లేషణ**
- **కొన్ని కీలక స్థానాల్లో గెలిచి ఉనికి చాటుకున్న బీజేపీ**



**తిరువనంతపురం మే 4, (నినాదం):** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల వామపక్ష పాలనకు తెరపడింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చారిత్రాత్మక విజయం సాధించింది. పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) ప్రభుత్వంపై ప్రజలు స్పష్టమైన వ్యతిరేక తీర్పు ఇచ్చారు. ఈ ఫలితంతో దేశంలో కమ్యూనిస్టుల పాలనలో ఉన్న చివరి రాష్ట్రం కూడా వారి చేజారినట్లయింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ప్రభుత్వం ఏర్పాటుకు 71 సీట్లు అవసరం కాగా, యూడీఎఫ్ కూటమి 102 స్థానాలతో తిరుగులేని విజయం అందుకుంది. మరోవైపు, అధికార ఎల్డీఎఫ్ కూటమి 35 స్థానాలతో సరిపెట్టుకుంది. ఎన్డీయే కూటమి 3 చోట్ల గెలిచి ఉనికిని చాటుకుంది. ఏప్రిల్ 9న ఎన్నికలు జరగగా, మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలే ఎల్డీఎఫ్ ఓటమికి ప్రధాన కారణాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ.. ఎల్డీఎఫ్ ప్రభుత్వ అహంకారం, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు ఇదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ.. తాము ఊహించిన దానికంటే గొప్ప విజయం లభించిందని అన్నారు. ఫలితాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు యూడీఎఫ్ సన్నాహాలు చేస్తోంది.

# దీదీ కంచుకోటను బద్దలుకొట్టిన కమలం

స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసుకొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయకులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయించింది.

**అమిత్ షా కనుసన్నల్లో పన్నా ప్రముఖ్ వ్యవస్థ**

స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10-15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30-60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశించారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్ స్థాయి సమావేశాల్లో కార్యకర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టినట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణే లక్ష్యంగా భాజపా పనిచేసింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను దృష్టిలోపెట్టుకొని వ్యూహాలను అమలు చేసింది.

**స్థానిక ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి..**

2021 ఎన్నికల వేళ నేరుగా మమతా బెనర్జీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేసి భాజపా దెబ్బతింది. ఈసారి మాత్రం ఆ తప్పు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, అవినీతిని లక్ష్యంగా చేసుకొని భాజపా శ్రేణులు ప్రచారం చేశాయి. 220 నియోజకవర్గాల్లోని టీఎంసీ ఎమ్మెల్యేలపై 'ఛార్జిషీట్లు' విడుదల చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. 10,000 కిలోమీటర్ల మేరకు భాజపా పరివర్తన్ యాత్రను చేపట్టింది. ఫలితంగా 77 మంది అభ్యర్థులను టీఎంసీ మార్చుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది.

**కలిసొచ్చిన మమత ఇబ్బందులు..**

ఈసారి ఎన్నికల్లో మమతా బెనర్జీకి మొదటి నుంచి అనుకూలించలేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన వెంటనే టీఎంసీ అనుకూల అధికారుల బదిలీలు, ఐప్యాక్‌పై ఈడీ దాడులు దీదీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికితోడు ప్రతి 140 మంది ఓటర్లకు ఒక సిబ్బంది చొప్పున మొత్తం 2.4 లక్షల మంది కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. ఈ నిర్ణయంతో పశ్చిమబెంగాల్‌లో అధికార పార్టీల కార్యకర్తలకు సహజంగా ఉండే దూకుడుకు కళ్లెం వేసినట్లైంది. దీనికితోడు సర్ విషయంలో న్యాయస్థానాల వద్ద మమత సర్కారు చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

**మహిళలు, యువత, రైతులే లక్ష్యంగా మేనిఫెస్టో..**

పశ్చిమబెంగాల్‌లో మహిళా ఓటర్లను ఆకట్టుకొన్న పార్టీకే విజయం లభిస్తుంది. ఇప్పటికే టీఎంసీ నుంచి వారికి లక్ష్మీభండార వంటి పలు పథకాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సాధికారతే తమ మ్యానిఫెస్టో లక్ష్యమంటూ భాజపా అగ్రనేత అమిత్‌షా ప్రకటించారు. అంతేకాదు, ప్రతి మహిళకు నెలకు రూ.3,000 ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం మమతా సర్కారు ఇస్తున్న దానికిది రెట్టింపు. గర్భిణులకు రూ.21,000, మహిళలకు ఉచిత బస్సు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్, యువతకు నెలకు రూ.3,000 భృతి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఏక మొత్తంగా రూ.15,000 మద్దతు ప్రకటించింది. వరిని క్వింటాల్ రూ.3,100కు కొనుగోలు వాగ్దానం, పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో రాష్ట్ర వాటా పెంచి రైతులకు ఏటా రూ.9,000 చెల్లించేట్లు ఇచ్చిన హామీలు ఆకర్షించాయి.

**ఉత్తర బెంగాల్‌పై పట్టు బిగించి..**

సహజంగానే ఉత్తరబెంగాల్‌లో భాజపాకు పట్టుంది. ఇక్కడ తేయాకు తోటల సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న రాజబోంగ్షీల సమస్యలపై పార్టీ ఈసారి దృష్టిపెట్టింది. వీరి సంఖ్య 10 లక్షలకు పైగానే ఉంటుంది. ఇక్కడ 2 శాతం ఓట్లు పెరిగినా.. ఈ ప్రాంతంలో తమ సీట్లను 40కు పైగా పెంచుకొనే అవకాశాన్ని గ్రహించి వాడుకొంది. స్వయంగా అమిత్‌షా ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చారు.

**మీకు మేమున్నాం..**

శాంతిభద్రత, సరిహద్దుల రక్షణ విషయంలో భాజపా తనదైన శైలిలో ప్రచారం చేసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 100% కంచె నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించింది. పశువుల అక్రమ రవాణా, అక్రమ చొరబాట్లను అణచివేస్తామన్న హామీలు ఓటర్లపై పనిచేశాయి.

**స్థానిక నేతలే కీలకం..**

పశ్చిమబెంగాల్‌లో 'బయటవారు' అన్న ముద్ర పోగొట్టుకోవడానికి భాజపా ప్రచారంలో కూడా జాగ్రత్తలు తీసుకొంది. సువేందు అధికారి, సుకాంత్ మజుందార్, దిలీప్ ఘోష్ వంటివారిని ముందుంచి ప్రచారం చేయించింది. కీలక ప్రాంతాల్లో మాత్రం కేంద్ర నేతలే ప్రచారం చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో ఏకంగా 66 ర్యాలీలు చేపట్టారు. ప్రధాని మోదీ 18 కార్యక్రమాల్లో, జేపీ నడ్డా 10 ర్యాలీల్లో ప్రచారాన్ని నడిపించారు.

## ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు...

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపు నేపథ్యంలో బీజేపీ 'ఎక్స్' వేదికగా 'మోదీమయమైన భారత్' అని ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చింది. ఈ మేరకు బీజేపీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది. హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అస్సోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

## ద్రవిడ కోటను బద్దలుకొట్టిన విజయ్..

కాంగ్రెస్ తర్వాత తమిళనాడులో ఒక ద్రవిడేతర పార్టీ అధికారం చేపట్టడం ఇదే ప్రథమం కానుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ఈ ఎన్నికల్లో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అయితే, ద్రవిడ పార్టీలకు ప్రత్యామ్నాయం లేదనుకున్న ఓటర్లకు విజయ్ ఒక కొత్త 'ఎంపిక'ను అందించారు. పెరియార్ సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని తన ప్రచారంలో జోడించి, డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై, ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ ఆశీస్సులు తనకు ఉన్నాయని చెప్పడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యారు.

**డీఎంకేకు కోలుకోలేని దెబ్బ**

ఈ ఫలితాలు డీఎంకేకు కోలుకోలేని దెబ్బ. వరుస విజయాలతో దూకుడు మీద ఉన్న స్టాలిన్ పార్టీకి ఇది ఊహించని పరాజయం. 2011లో జయలలిత చేతిలో ఓటమి తర్వాత డీఎంకే పదేళ్ల పాటు రాజకీయంగా ఇబ్బందులు పడింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి తలెత్తవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఏఐఏడీఎంకేకు పునరుజ్జీవం**

మరోవైపు ఈ ఎన్నికల ఫలితాలు ఏఐఏడీఎంకేకు ఒకరకంగా పునరుజ్జీవం లాంటివి. నాయకత్వ లేమి, ముఖ్య నేతలు పార్టీని వీడటంతో బలహీనపడిందని భావించినప్పటికీ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో పట్టు నిలుపుకొని ఆశ్చర్యపరిచింది. ఓటమి పాలైనా, పార్టీ పునర్నిర్మాణానికి ఈ ఫలితాలు ఒక బలమైన పునాది వేశాయని చెప్పవచ్చు. మొత్తం మీద ఈ ఎన్నికలు తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాయి.

**కేంద్ర పథకాల అమలుపై సమగ్ర సమీక్ష**

## రాష్ట్ర పనితీరుకు కేంద్ర ప్రశంసలు

ప్రాయోజిత పథకాల అమలును సమీక్షించేందుకు, కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు) సబ్యసాచి ఘోష్‌తో కలిసి ఈరోజు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అట్టడుగు వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకున్న కీలక సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించింది. వీటిలో ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పౌర హక్కుల పరిరక్షణ చట్టం, ఎస్సీ/బీసీ హాస్టళ్ల నిర్మాణం, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సమగ్ర పునరావాసం, మరియు యాంత్రిక పారిశుధ్య పర్యావరణ వ్యవస్థ కోసం జాతీయ కార్యాచరణ (నమస్తే) వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర కార్యదర్శి సుధాన్ష్ పంత్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, మరింత విస్తృత ప్రచారం మరియు ప్రభావాన్ని నిర్ధారించడానికి ఇంకా మెరుగుపడటానికి ఆస్కారం ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని అట్టడుగు మరియు బలహీన వర్గాల సామాజిక-ఆర్థిక అభ్యున్నతికి నిరంతర, స్థిరమైన ప్రయత్నాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన పెండింగ్ సమస్యలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని కేంద్ర కార్యదర్శి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరింత ఆర్థిక సహాయం అందించి, అర్హులైన లబ్ధిదారులకు విస్తృత కవరేజీని, అధిక ప్రయోజనాలను చేకూరుస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లిదండ్రుల సహాయ చట్టం (టెలంగాణ పేరెంటల్ సపోర్ట్ యాక్ట్) వంటి ప్రగతిశీల చొరవను ఆయన అభినందిస్తూ, ఇది సామాజిక రక్షణ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ రాష్ట్రంలోని వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల స్థితిపై సవివరమైన సమీక్షను సమర్పించారు. ఆయన సాధించిన విజయాలు, కొనసాగుతున్న కార్యక్రమాలు, అమలు వ్యూహాలను వివరించడంతో పాటు, కేంద్రం నుండి మద్దతు మరియు స్పష్టత అవసరమైన అనేక విధానపరమైన మరియు కార్యాచరణపరమైన విషయాలను కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో పాటు ఎస్సీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమ శాఖలు మరియు ఇతర సంబంధిత శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఒమన్‌లో చిక్కుకున్న ఏపీ మహిళ..

పవన్ కల్యాణ్ కార్యాలయం ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు ముగింపు పడింది. గత నవంబర్‌లో ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన షెహనాజ్, అక్కడి పని నచ్చక తిరిగి రావాలనుకున్నారు. కానీ, యజమాని ఆమెను అనుమతించకుండా నిర్బంధించి, ఫోన్ లాక్కున్నారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన షెహనాజ్… "పవన్ కల్యాణ్ అన్న, నన్ను కాపాడండి. ఇక్కడ కొడుతున్నారు, తిండి, నీళ్లు కూడా ఇవ్వడం లేదు. నా ప్రాణాలకు ప్రమాదం ఉంది" అంటూ కన్నీటితో ఓ వీడియో సందేశాన్ని సోషల్ మీడియా ద్వారా పంపారు. ఈ వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆమెను వెంటనే వెనక్కి రప్పించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. దీంతో వారు తక్షణమే రంగంలోకి దిగి, షెహనాజ్ భర్త ద్వారా ఒమన్‌లోని ఏజెంట్‌తో మాట్లాడారు. అదే సమయంలో భారత విదేశాంగ శాఖ, మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరిపారు. మరోవైపు షెహనాజ్ భర్త అబూబకర్ ఏపీఎన్ఆర్టీఎస్‌కు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా వేగంగా స్పందించింది. మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ రాసింది. ప్రభుత్వ అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం తొలుత ఏజెంట్ ఖర్చుల కింద రూ. 2 లక్షలు డిమాండ్ చేశారు. అయితే, స్థానిక పోలీసుల జోక్యంతో జరిగిన చర్చల తర్వాత ఏజెంట్ తన ఖర్చులతోనే షెహనాజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పంపడానికి అంగీకరించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, వలస కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. షెహనాజ్‌ను వెనక్కి తీసుకురావడంలో చొరవ చూపిన ఏపీఎన్ఆర్టీఎస్ అధికారులను ఆయన అభినందించారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయడం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. అందుకే ఈ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని వివరించారు. సీఎం, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ఈ సందర్భంగా రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎంకి భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు తదితర కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసిన లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతులకు ధైర్యం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరం అయితే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఆ క్రమంలో ఈ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా గోస పుచ్చుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులకు సమయానికి రైతుబంధు వేసిన చరిత్ర కేసీఆర్‌ది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా అన్నదాతలను వేధిస్తోందని అన్నారు. ఆంక్షలు లేకుండా పంటలు కొన్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరి, జొన్నలు, శనగ పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదని తెలిపారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ కదం తొక్కుతుందని పేర్కొన్నారు. రాబోయే వారం రోజుల పాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలియజేయాలన్నారు. తహశీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీద్దామని అన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు కంచెలేక విద్యుదఘాతం ఎద్దు మృతి

**వికారాబాద్, మే 4(నినాదం ):**




ఎకమామిడి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. సోమవారం రైతు పసుల రాజు ఎద్దు, పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు లక్ష రూపాయల విలువగల ఈ ఎద్దు మృతి చెందడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు సరైన రక్షణ చర్యలు లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నష్టపోయిన రైతు పసుల రాజు గారికి తగిన పరిహారం అందించి న్యాయం చేయాలని గ్రామస్తులు బాధిత రైతు విజ్ఞప్తి చేస్తున్నారు.

EVENING 6 PM
ninadam.in
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
సోమవారం మే 04 2026
03
డిజిటల్ ఎడిషన్

## జేఈఈ మెయిన్స్ టాపర్లను అభినందించిన సీఎం చంద్రబాబు



**ఉండవల్లి మే 4, (నినాదం):**
జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ పరీక్షలో 100 పర్సంటైల్ సాధించి టాపర్లుగా నిలిచిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు నిన్న రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వివరాల్లోకి వెళ్తే, నారాయణ విద్యాసంస్థల్లో చదివి 100 పర్సంటైల్ సాధించిన మహిత్ ఆంధ్రప్రదేశ్‌లో టాపర్‌గా నిలిచారు. అలాగే తెలంగాణ నుంచి సాయి రిత్విక్‌రెడ్డి, మహేశ్వరి, భవితేష్‌రెడ్డి టాపర్లుగా నిలిచారు. ఈ విద్యార్థులతో పాటు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు కె. పునీత్, గంటా రవితేజ, పి. సింధూర, శరణి కూడా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ తెలుగు విద్యార్థుల ప్రతిభను చాటుతున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాన్ని, సిబ్బందిని కూడా ముఖ్యమంత్రి అభినందించారు.

## రాయచోటిలో వైసీపీ నేత దశరథరామిరెడ్డిపై హత్యాయత్నం

### మంత్రి అనుచరుల పనేనని ఆరోపణ

- భూవివాదం నేపథ్యంలో కత్తులు, రాడ్లతో దాడి చేసిన ప్రత్యర్థులు
- బాధితుడికి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స, పరిస్థితి విషమం
- రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని వైసీపీ నేతల ఆగ్రహం




**అన్నమయ్య జిల్లా మే 4, (నినాదం):**
అన్నమయ్య జిల్లా రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నేత, రాయచోటి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పి. దశరథరామిరెడ్డిపై నిన్న హత్యాయత్నం జరిగింది. భూవివాదం నేపథ్యంలో ప్రత్యర్థులు కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ దాడి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అనుచరుల పనేనని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే, దశరథరామిరెడ్డికి చెందిన కల్యాణమండపం సమీపంలోని ఓ స్థలంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయంపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ, ఆదివారం సుమారు 100 మంది ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు వివాదాస్పద స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నిం చారు. దీనిని ప్రశ్నించిన దశరథరామిరెడ్డిపై వారు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దశరథరామిరెడ్డితో పాటు ఆయన అనుచరులు జాకీర్, దేరంగుల ఆంజనేయులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. దాడి చేసిన వారు కల్యాణమండపాన్ని, ఆయన వాహనాన్ని ధ్వంసం చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై వైసీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి భూమన కరుణాకర్ రెడ్డి పరామర్శించారు. దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని మిథున్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని భూమన విమర్శించారు. ఈ ఘటనతో రాయచోటిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు బాధితుడి నుంచి వాంగ్మూలం స్వీకరించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొడుకు సాయంతో ప్రియుడిని చంపిన మహిళ

- సహజీవనం చేస్తున్న వ్యక్తిని హత్య చేసిన మహిళ, ఆమె కుమారుడు
- వేధింపులు తట్టుకోలేకే ఈ దారుణానికి పాల్పడినట్లు వెల్లడి
- మటన్ కత్తితో గొంతు కోసి చంపిన నిందితులు
- మృతదేహాన్ని సంచిలో తరలిస్తూ పోలీసులకు చిక్కిన వైనం
- హైదరాబాద్ జీడిమెట్ల పరిధిలోని చింతల్‌లో ఘటన

**హైదరాబాద్ మే 4, (నినాదం):**
హైదరాబాద్ నగరంలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తనతో పదేళ్లుగా సహజీవనం చేస్తున్న వ్యక్తిని ఓ మహిళ తన కుమారుడితో కలిసి హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన చింతల్ అంబేద్కర్‌నగర్‌లో నిన్న రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లాకు చెందిన శివారెడ్డి (40) అనే వ్యక్తితో అరుణ (35) గత పదేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఆమె కుమారుడు సాయిరత్నం (19) కూడా వారితోనే నివసిస్తున్నాడు. అయితే, కొంతకాలంగా శివారెడ్డి.. అరుణను, ఆమె కుమారుడిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తట్టుకోలేక, అతడిని అంతమొందించాలని తల్లీకొడుకులు నిర్ణయించుకున్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో గొడవ జరగడంతో, పథకం ప్రకారం మటన్ కొట్టే కత్తితో శివారెడ్డి గొంతు కోసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఓ సంచిలో మూటగట్టి, బయట పడేసేందుకు తీసుకెళ్తుండగా గస్తీ కాస్తున్న పోలీసులు వారిని గమనించారు. అనుమానంతో సంచిని తనిఖీ చేయగా, అందులో శివారెడ్డి మృతదేహం బయటపడింది. దీంతో పోలీసులు వెంటనే అరుణ, సాయిరత్నంలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వేధింపుల కారణంగానే ఈ హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

## ఏపీలో మళ్లీ 'నక్ష' సర్వే.. ఇక ప్రతి ఇంటికి ప్రత్యేక ప్రాపర్టీ కార్డు

- నగరాలు, పట్టణాల్లోని ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీ చేయనున్న ఏపీ ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ 'నక్ష' ప్రాజెక్టు కింద డ్రోన్ల సహాయంతో సర్వే పునఃప్రారంభం
- క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డు ద్వారా ఆస్తి వివరాలు, రిజిస్ట్రేషన్ సులభతరం
- బ్యాంకు రుణాలు పొందడం, మున్సిపల్ ప్రణాళికల రూపకల్పనకు ఈ కార్డులు కీలకం
- 2027 మార్చి నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం



**అమరావతి, మే 4 (నినాదం) :**
ఏపీలోని నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజల ఆస్తులకు పటిష్ఠమైన భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి కుటుంబానికి చెందిన ఇళ్లు, స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలతో కూడిన 'ప్రాపర్టీ కార్డు'లను జారీ చేయాలని నిశ్చయించింది. ఇందుకోసం గతంలో మధ్యలోనే నిలిచిపోయిన 'నక్ష' (నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించనుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ సర్వేను పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామాల్లో 'స్వామిత్వ' పథకం తరహాలోనే పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజల ఆస్తులను ఆధునిక డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఉపయోగించి సర్వే చేయాలని కేంద్రం 2024లో 'నక్ష' ప్రాజెక్టును ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాలను ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాకినాడ, ఏలూరు, గుంటూరు, మంగళగిరి–తాడేపల్లి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కుప్పం, అనంతపురం వంటి తొమ్మిది నగరాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ నగరాల్లో సర్వే ప్రక్రియ కొంతవరకు జరిగినా, రికార్డుల నమోదు, మ్యాపింగ్ వంటి కీలక పనులు పూర్తికాలేదు. దీంతో వాస్తవ గడువు ముగిసినప్పటికీ, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి ఆస్తి యజమానికి ఒక ప్రాపర్టీ కార్డు లభిస్తుంది. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆస్తికి సంబంధించిన పూర్తి వివరాలు (విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు) సులభంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల ఆస్తుల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ వంటి ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగంగా పూర్తవుతాయి. అంతేకాకుండా, ఈ కార్డులను ప్రామాణికంగా చూపి బ్యాంకుల నుంచి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు, మున్సిపల్ అధికారులకు తమ పరిధిలోని ఆస్తులపై స్పష్టమైన సమాచారం ఉండటంతో నగర ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సులభతరం అవుతుంది. త్వరలోనే ఈ సర్వే పునఃప్రారంభంపై ప్రభుత్వం నుంచి అధికారికంగా స్పష్టత రానుంది.

## గల్ఫ్‌లో ప్రియుడు.. ఊళ్లో ప్రియురాలు ఆత్మహత్య.. నిశ్చితార్థం అనంతరం విషాదాంతంగా మారిన లవ్‌స్టోరీ



**జగిత్యాల మే 4, (నినాదం):**
వారి ప్రేమకు పెద్దలు అంగీకరించారు.. కానీ విధి వారిని ఒక్కటి కానివ్వలేదు. ఎంగేజ్‌మెంట్ తర్వాత ఆర్థిక ఇబ్బందులతో గల్ఫ్‌లో ప్రియుడు ఆత్మహత్య చేసుకోగా.. అది తెలిసి ఊళ్లో ప్రియురాలు బలవన్మరణానికి పాల్పడింది. జగిత్యాల జిల్లాలో జరిగిన ఈ విషాద ఘటన అందర్నీ కలిచివేసింది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం పాతదాంరాజుపల్లికి చెందిన మక్కల సాయికుమార్(22), సిరిపూర్ గ్రామానికి చెందిన ఒల్లె శ్రుతి(20) ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలిసిన పెద్దలు కూడా వారికి పెళ్లికి అంగీకరించారు. ఏడు నెలల క్రితం ఎంగేజ్‌మెంట్ కూడా చేశారు. అయితే తమకు రేకులు షెడ్డు మాత్రమే ఉండటంతో.. ఇల్లు కట్టుకున్నాకే పెళ్లి చేసుకుంటానని చెప్పి సాయికుమార్ గల్ఫ్ దేశమైన బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి కారణంగా ఈ నెల 1న సాయికుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి ఈ విషయం తెలియడంతో శ్రుతి తీవ్ర మనస్తాపానికి గురైంది. అదే రోజు అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. త్వరలోనే పెళ్లి చేసుకోవాల్సిన ప్రేమ జంట మరణంతో రెండు గ్రామాలు విషాదఛాయల్లో మునిగిపోయాయి.

## నవలి ప్రాజెక్టుపై చర్చలకు చంద్రబాబు సమయం ఇవ్వడం లేదన్న డీకే

- తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు దాదాపు పూర్తి
- మే 15న గేట్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- గేట్ల ఏర్పాటు ఖర్చును కర్ణాటక, ఏపీ పంచుకున్నాయని వెల్లడి
- బోర్డు సమావేశంలోనే నవలిపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టీకరణ




**బెంగళూరు, మే 4 (నినాదం) :**
తుంగభద్ర డ్యామ్‌కు కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు పనులు దాదాపు పూర్తయ్యాయని, అయితే నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చల్లో జాప్యం జరుగుతోందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఆదివారం ఆయన తుంగభద్ర డ్యామ్ వద్ద గేట్ల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ.. "తుంగభద్ర డ్యామ్‌కు మొత్తం 33 కొత్త గేట్లను అమర్చాం. కేవలం కొద్దిపాటి పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. మే 7 నాటికి ఆ పనులను పూర్తి చేసి, మే 15న ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం" అని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.54 కోట్లు ఖర్చయిందని, ఈ వ్యయాన్ని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ 64:34 నిష్పత్తిలో భరించాయని ఆయన వివరించారు. ఈ గేట్ల ఏర్పాటుతో 7.50 లక్షల మంది రైతుల ప్రయోజనాలు కాపాడినట్లు అవుతుందని అన్నారు. అనంతరం నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, డ్యామ్‌లో పూడికతీత అంశాలపై విలేకరులు ప్రశ్నించగా ఆయన స్పందించారు. "ఈ విషయంలో చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాకు సమయం ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఏపీకి ఎక్కువ నీరు అందుతుండటంతో ఆయనకు ఆసక్తి లేనట్లుంది. ఈ అంశంపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా బోర్డు సమావేశంలోనే చర్చించి తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. డ్యామ్‌లో పూడిక తొలగించడం అంత సులభమైన విషయం కాదని, దానికి గ్లోబల్ టెండర్ పిలవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త గేట్లు రాబోయే 50 ఏళ్లపాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తాయని డీకే శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం ఒక పంటను త్యాగం చేసిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## లిపులేఖ్‌పై మళ్లీ వివాదం.. కైలాస యాత్రపై భారత్‌కు నేపాల్ అభ్యంతరం

- మళ్లీ తెరపైకి భారత్-నేపాల్ సరిహద్దుల పంచాయితీ
- లిపులేఖ్ తమ భూభాగమని, తమ అనుమతి లేకుండా వాడొద్దని స్పష్టీకరణ
- 1954 నుంచి ఈ మార్గాన్ని వాడుతున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- 2020లో భారత్ రోడ్డు నిర్మించడంతో తీవ్రస్థాయికి వివాదం



**డెహ్రాడూన్, మే 4 (నినాదం) :**
కైలాస మానస సరోవర యాత్ర విషయంలో భారత్, నేపాల్ మధ్య మరోసారి సరిహద్దు వివాదం రాజుకుంది. యాత్ర కోసం ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ కనుమ మార్గాన్ని ఉపయోగించడాన్ని నేపాల్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ ప్రాంతం తమ భూభాగమని, తమ అనుమతి లేకుండా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం ఖాట్మండూలో నేపాల్ విదేశాంగ శాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**ఏమిటీ వివాదం?**
ప్రతిష్ఠాత్మకమైన కైలాస మానస సరోవర యాత్ర–2026ను జూన్ నుంచి ఆగస్టు మధ్య నిర్వహించనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. సిక్కింలోని నాథూ లా, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ అనే రెండు మార్గాల ద్వారా యాత్ర కొనసాగుతుందని తెలిపింది. ఇందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ నిర్ణయంపై నేపాల్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమతో సంప్రదించకుండా, తమ భూభాగంపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించింది. ఈ అంశాన్ని దౌత్య మార్గాల ద్వారా భారత్, చైనా దృష్టికి తీసుకెళ్లామని తెలిపింది.

**భారత్ స్పందన**
నేపాల్ అభ్యంతరాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. లిపులేఖ్ విషయంలో తమ వైఖరి స్పష్టంగా ఉందని, అందులో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. 1954 నుంచి కైలాస యాత్రకు ఇదే మార్గాన్ని ఉపయోగిస్తున్నామని, ఇది కొత్త పరిణామం కాదని పేర్కొంది. నేపాల్ ప్రాదేశిక వాదనలకు చారిత్రక ఆధారాలు లేవని, ఏకపక్షంగా సరిహద్దులను విస్తరించుకోవడం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. అయితే, సరిహద్దు వివాదాలు సహా అన్ని ద్వైపాక్షిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

**నేపథ్యం**
1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం కాళీ నదికి తూర్పున ఉన్న లింపియాధుర, కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తోంది. అయితే, 2020లో లిపులేఖ్ కనుమ వరకు భారత్ 80 కిలోమీటర్ల పొడవైన రహదారిని నిర్మించడంతో ఈ వివాదం తీవ్రస్థాయికి చేరింది. అప్పటి కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం ఈ మూడు ప్రాంతాలను తమ దేశంలో అంతర్భాగంగా చూపుతూ కొత్త రాజకీయ పటాన్ని విడుదల చేసింది. అప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

## కారంపూడి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు.. ఆరుగురు అరెస్ట్


- నిందితుల నుంచి బంగారం, వాహనాలు స్వాధీనం
- జ్యువెలరీ షాపు ఉద్యోగే సూత్రధారి అని తేల్చిన పోలీసులు
- సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు



**పల్నాడు జిల్లా మే 4, (నినాదం):**
పల్నాడు జిల్లా కారంపూడిలో పట్టపగలు బంగారం వ్యాపారిపై దాడి చేసి రూ.60 లక్షల విలువైన ఆభరణాలు దోచుకెళ్లిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ దోపిడీకి పాల్పడిన ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి బంగారం, నేరానికి ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను పల్నాడు ఎస్పీ బి. కృష్ణారావు మీడియాకు వెల్లడించారు. వినుకొండకు చెందిన బంగారం వ్యాపారి యక్కల శ్రీనివాసరావుపై ఇటీవల జరిగిన దోపిడీ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. స్థానిక జ్యువెలరీ షాపులో పనిచేస్తున్న గోసుల శంబయ్య (27) ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి అని తేల్చారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో, చెడు అలవాట్లకు బానిసైన శంబయ్య.. వ్యాపారి శ్రీనివాసరావు కదలికలపై నిఘా పెట్టాడు. ప్రతి సోమవారం శ్రీనివాసరావు ఆభరణాలతో కారంపూడికి వస్తాడని తెలుసుకుని, తన స్నేహితులతో కలిసి దోపిడీకి పక్కా ప్రణాళిక రచించాడు. ప్లాన్ ప్రకారం, బండారు అజిత్ (25), కె. శశికుమార్ (22), కె. సాయికిరణ్ (24), ఎ. నిఖిల్ మహేష్ (20), జి. పవన్ (30)లతో కలిసి శంబయ్య ఈ దోపిడీకి పాల్పడ్డాడు. వ్యాపారిపై దాడి చేసి, బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును లాక్కొని బైక్‌లపై పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గురజాల డీఎస్పీ మహేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి, ఎన్ఎస్పీ కాలువ కట్ట వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 566.60 గ్రాముల బంగారు ఆభరణాలు, నేరానికి ఉపయోగించిన యమహా ఎంటీ–15, హీరో గ్లామర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన దర్యాప్తు బృందాన్ని ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

## ప్రజావాణి హాల్ ముందు రైతు ఆత్మహత్యయత్నం

- ధరణి లోపాలతో తమ్ముడి భూమి అన్న పేర..!
- పదేళ్లుగా పంచాయతీ..
- అధికారుల నిర్లక్ష్యంతో
- విసిగి వేసారిన రైతు...
- అడిషనల్ కలెక్టర్ ముందే క్రిమిసంహారక మందు తాగి...
- అపస్మారక స్థితిలోకి..

**నారాయణపేట ప్రతినిధి, మే 4, (నినాదం):**
పదేళ్లుగా తన భూమి వేరే వాళ్ళ పేరా నమోదు కావడంతో అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిన ఓ రైతు సోమవారం నాడు ప్రజావాణి హాలు ముందు క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే నారాయణపేట జిల్లాలోని దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామానికి చెందిన నడిపి కనకప్ప (55) అనే రైతు తన పేరు మీద ఉన్న 31 గుంటల భూమి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో తారుమారు కావడంతో తన అన్న పేరు మీద అయినట్టు ఆరోపిస్తూ 10 ఏళ్లుగా కుటుంబాల మధ్య పంచాయతీలు నడిచినప్పటికీ కొలిక్కి రాకపోవడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగివేసారి సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్కు విన్నవించే ప్రయత్నంలో ఇక్కడ కూడా న్యాయం జరగదేమో అని భావించి తన వెంబడి తీసుకువచ్చిన క్రిమిసంహారకమందును సేవించడంతో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడంతో అక్కడున్న సిబ్బంది అట్టి రైతును హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఇట్టి తగాదా విషయానికి సంబంధించిన కొన్ని వివరాలను సదరు రైతు అన్న కుమారుడు సోషల్ మీడియా వేదిక ద్వారా వివరణ ఇస్తూ గత 40 ఏళ్లుగా అట్టి భూమి మా నాన్న పేరు మీదనే పట్టా ఉందని తెలిపారు. ఇన్నేళ్లుగా అట్టి భూమిపై కబ్జాలో వారే ఉన్నట్టు తెలిపారు. వీరిపై ఊరిలోని కొందరు పనిగట్టుకుని కక్షగట్టి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది కావాలనే కొందరు బ్లాక్ మెయిల్ కు పాల్పడుతున్నారని అన్నారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన రైతు కుమారుడిని అదనపు కలెక్టర్ పిలిచి పూర్తి వివరాలు సేకరించి అట్టి వివాదారహితమైన భూమిపై విచారణ చేపట్టి నిజానిజాలు సేకరించే వరకు ఓపిక పట్టవలసిందిగా, ఎలాంటి అగ్రైత్యాలకు పాల్పడవద్దని తెలియజేసినట్టు సమాచారం.

## విశాఖలో హైడ్రాలిక్ జాకీల సహాయంతో పైకి లేపుతుండగా కూలిన భవనం... ఒకరి మృతి..

- గాజువాక ప్రాంతంలోని వికాస్‌నగర్‌లో జరిగిన ఘటన



**విశాఖ మే 4, (నినాదం):**
విశాఖ నగరంలో విషాదం చోటుచేసుకుంది. గాజువాక ప్రాంతంలోని వికాస్‌నగర్‌లో నిన్న సాయంత్రం ఒక భవనం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఒక కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనాన్ని హైడ్రాలిక్ జాకీల సహాయంతో పైకి లేపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రోడ్డు లెవల్ కంటే సుమారు రెండు అడుగుల దిగువన ఉన్న ఈ భవనం ఎత్తు పెంచేందుకు యజమాని ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ పనుల్లో భాగంగా ఎనిమిది నుంచి పది మంది కార్మికులు పాల్గొన్నారు. అయితే, ఎలాంటి ఇంజనీరింగ్ పర్యవేక్షణ లేకుండా, అశాస్త్రీయంగా జాకీలతో భవనాన్ని పైకి లేపే ప్రయత్నం చేయడంతో అది ఒక్కసారిగా కుప్పకూలింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురి దుర్మరణం



**తిరుపతి మే 4, (నినాదం):**
తిరుపతి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద పుత్తలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఓ అంబులెన్స్ వేగంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్ లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఓ రోగిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగంతో వచ్చిన అంబులెన్స్, అప్పటికే రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ సహా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు లేదా అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదం కారణంగా నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు.

### రామన్నపేటలో ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళన

**యాదాద్రి భువనగిరి జిల్లా మే 4, (నినాదం):**
ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో చిట్యాల ఉ భునగిరి రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి రహదారిపై వడ్లు పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే ప్రభుత్వ అసమర్థతో పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు వర్షాలకు తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మద్దతు తెలిపారు.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

సోమవారం మే 04 2026

ninadam.in

EVENING 6 PM

04

డిజిటల్ ఎడిషన్


# ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కిడ్నాప్..

## గన్‌తో బెదిరించి రూ. 1.8 కోట్లు బదిలీ!

- ఢిల్లీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్‌ను కిడ్నాప్ చేసిన ఫ్రాంచైజీ భాగస్వామి
- అరుపులు బయటకు వినిపించకుండా ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం
- బాధితురాలికి గంటలపాటు నరకం చూపిన నిందితులు
- డబ్బు బదిలీ అయిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన పోలీసులు
- ఆసుపత్రి బెడ్‌పై నిందితుడి అరెస్ట్





**భోపాల్ మే 4, (నినాదం):** వ్యాపార భాగస్వామే కాలయముడయ్యాడు. నమ్మించి పిలిపించి, కిడ్నాప్ చేసి, కణతకు తుపాకీ గురిపెట్టి గంటలపాటు నరకం చూపించాడు. బలవంతంగా రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయించుకున్నాడు. భోపాల్‌లో జరిగిన ఈ సంచలన ఘటన, ఏ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌కూ తీసిపోని రీతిలో సాగింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్‌కు ఎదురైన ఈ భయానక అనుభవం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే 'శుభ్రా రంజన్ ఐఏఎస్ అకాడమీ' డైరెక్టర్ శుభ్రా రంజన్‌ను, అదే అకాడమీకి భోపాల్‌లో ఫ్రాంచైజీ నడుపుతున్న ప్రియాంక్ శర్మ మోసపూరితంగా భోపాల్‌కు ఆహ్వానించాడు. నగరంలో మరో సెంటర్ ప్రారంభించాలని, సెమినార్ నిర్వహించాలని నమ్మబలికాడు. ఇది నిజమేనని నమ్మి ఆమె భోపాల్ వచ్చారు. బుధవారం మధ్యాహ్నం 2-3 గంటల సమయంలో, ఆమె బస చేస్తున్న 5-స్టార్ హోటల్ నుంచి ప్రియాంక్ ఆమెను తన కారులో ఎక్కించుకుని బాగ్‌సేవానియా ప్రాంతంలోని ఓ అద్దె ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ప్రియాంక్ ఏర్పాటు చేసిన సాయుధులైన వ్యక్తులు కాపు కాశారు. ఫ్లాట్‌లోకి వెళ్లగానే శుభ్రా రంజన్, ఆమె సహాయకులను బంధించారు. దాదాపు నాలుగు గంటల పాటు తుపాకీతో బెదిరిస్తూ, 'జనక్షిలా సొసైటీ', 'ఆర్ఎస్ ఎంటర్‌ప్రైజెస్' పేర్లతో ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.1.89 కోట్లు ఆన్‌లైన్‌లో బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. వారి అరుపులు, కేకలు బయటకు వినిపించకుండా ఉండేందుకు నిందితులు అదే ఫ్లాట్‌లో సుందరకాండ పారాయణం ఏర్పాటు చేయడం గమనార్హం. ఇది భక్తితో చేసింది కాదని, బాధితురాలి గొంతును అణచివేసేందుకే ఈ నాటకం ఆడారని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయకుండా భయపెట్టేందుకు ఓ నకిలీ వీడియోను కూడా రికార్డ్ చేశారు. అందులో ఓ వ్యక్తిని తాళ్లతో కట్టి బాక్సులో బంధించినట్లు చూపించి, ఫిర్యాదు చేస్తే తమ సహచరులకు ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.

**రంగంలోకి క్రైమ్ బ్రాంచ్.. ఖాతాల స్తంభన**

డబ్బు బదిలీ పూర్తయ్యాక బుధవారం రాత్రి బాధితులను విడిచిపెట్టారు. వెంటనే బాధితుల తరఫున సంతోష్ కుమార్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భోపాల్ క్రైమ్ బ్రాంచ్ రంగంలోకి దిగింది. పోలీస్ కమిషనర్ సంజయ్ కుమార్ సింగ్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. గంటల వ్యవధిలోనే స్పందించిన పోలీసులు, నిందితులు డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. దీంతో రూ.1.89 కోట్ల మొత్తం భద్రంగా ఉంది. మరోవైపు, అరెస్ట్ తప్పదని భావించిన ప్రధాన నిందితుడు ప్రియాంక్ శర్మ విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించాడు. అది విఫలమవడంతో, తీవ్ర అనారోగ్యం నటిస్తూ భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రిలోని ఐసీయూలో చేరాడు. అయితే, పక్కా సమాచారంతో అక్కడికి చేరుకున్న క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, వైద్యులను సంప్రదించి అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని నిర్ధారించుకుని, ఆస్పత్రి బెడ్‌పైనే అతడిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ సమయంలో ప్రియాంక్ తల్లి, భార్య పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రియాంక్ విచారణ అనంతరం మరో ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిని కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ నేరంలో ఉపయోగించిన కారు, మొబైల్ ఫోన్, తుపాకిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రియాంక్ భార్య పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. దోపిడీకి గురైన డబ్బును తిరిగి బాధితురాలికి అప్పగించే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.

# కరీంనగర్ జ్యుయెలరీ షాపు చోరీ...

## దొంగల ఆచూకీ చెబితే రూ.1 లక్ష

- కరీంనగర్ పీఎంజే జ్యువెలర్స్‌లో సాయుధ దోపిడీ
- సిబ్బందిపై కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- ఐదుగురు నిందితుల ఫోటోలను విడుదల చేసిన పోలీసులు
- దోపిడీ దొంగల ఆచూకీ తెలిపితే రూ.లక్ష బహుమతి
- సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ




**కరీంనగర్ మే 4, (నినాదం):** కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురు నిందితుల ఫోటోలను పోలీసులు విడుదల చేయడంతో పాటు, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష నగదు బహుమతిని ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు. నిన్న ఉదయం కరీంనగర్‌లోని జ్యోతినగర్ లో ఉన్న పీఎంజే జ్యువెలర్స్‌లోకి వినియోగదారుల రూపంలో ప్రవేశించిన ఐదుగురు సాయుధ దుండగులు, ఒక్కసారిగా సిబ్బందిపై తుపాకులతో కాల్పులకు తెగబడటంతో నలుగురు సిబ్బందికి గాయాలైన విషయం తెలిసిందే. అనంతరం దుండగులు భారీ మొత్తంలో బంగారు ఆభరణాల ను దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దోపిడీని తీవ్రంగా పరిగణించిన పోలీసులు, నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. "ఈ ఫోటోలలో ఉన్న వ్యక్తులు కరీంనగర్ నగల దుకాణంలో జరిగిన దోపిడీలో పాల్గొన్నారని, వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సరైన సమాచారం అందించిన వారికి రూ.1 లక్ష బహుమతి ఇవ్వబడుతుంది" అని పోలీసులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కరపత్రాలను విడుదల చేశారు. నిందితులకు సంబంధించి ఏవైనా ఆధారాలు లభిస్తే కరీంనగర్ టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ (8712670762), ఏసీపీ (8712670711), లేదా ఎస్‌బీ కంట్రోల్ రూం (8712670713) నంబర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# నోబెల్ బరిలో భారత 'ప్యాడ్‌మ్యాన్'

- అతి తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్లు అందిస్తున్న అరుణాచలం
- మహిళల ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన పారిశ్రామికవేత్త
- నోబెల్ బహుమతికి ఆయన పేరును నామినేట్ చేసిన పుదుచ్చేరి కంటి ఆసుపత్రి డీన్
- 24 గంటల్లోనే నామినేషన్‌కు ఆమోదం
- అరుణాచలం జీవితం ఆధారంగా 2018లో 'ప్యాడ్‌మ్యాన్' సినిమా







**ఢిల్లీ, మే 4 (నినాదం) :** భారతదేశ 'ప్యాడ్‌మ్యాన్'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కోయంబత్తూరుకు చెందిన పారిశ్రామికవేత్త అరుణాచలం మురుగనందం నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా వెల్లడించారు. 2026 సంవత్సరానికి గానూ ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతికి తన పేరు నామినేట్ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు తక్కువ ధరకే శానిటరీ ప్యాడ్లను అందుబాటులోకి తెచ్చి, వారి ఆరోగ్య పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినందుకు గాను ఆయన ఈ గుర్తింపునకు చేరువయ్యారు. "మొదట నేను నమ్మలేకపోయాను. పుదుచ్చేరిలోని అరవింద్ కంటి ఆసుపత్రి డీన్, అక్కడి అమెరికన్ బృందాలు నా పేరును ప్రతిపాదించాయి. 24 గంటల్లోనే నా నామినేషన్ ఆమోదం పొందింది. ఇది నాకు చాలా గర్వంగా ఉంది" అని ఒక వార్తా సంస్థతో మురుగనందం తన సంతోషాన్ని పంచుకున్నారు. తమిళనాడుకు చెందిన అరుణాచలం జీవితం ఆధారంగానే 2018లో 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం తెరకెక్కింది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా సామాజిక అంశాలపై ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. సాధారణంగా నోబెల్ బహుమతి నామినేషన్ల ప్రక్రియ ఎనిమిది నెలల పాటు చాలా క్లిష్టంగా సాగుతుంది. నార్వేకు చెందిన ఐదుగురు సభ్యుల నోబెల్ కమిటీ పలు దశల్లో నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేస్తుంది.

# తమిళనాడు ఫలితాల టెన్షన్..

## తిరుమలలో త్రిష పూజలు!



**తిరుమల మే 4, (నినాదం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న వేళ, ప్రముఖ సినీ నటి త్రిష తిరుమల పర్యటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఈరోజు ఉదయం ఆమె శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తమిళనాడులో హోరాహోరీగా సాగిన ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో తేలనుండగా, ఈ దర్శనం ప్రాధాన్యం సంతరించుకుంది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ ఈ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తుండటంతో, ఆయన విజయం కోసమే త్రిష శ్రీవారిని ప్రార్థించినట్లుగా ప్రచారం జరుగుతోంది. సోమవారం త్రిష పుట్టినరోజు కూడా కావడం మరో విశేషం. ఆదివారం రాత్రే తాను తిరుపతికి ప్రయాణిస్తున్నట్లు త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. ఎన్నికల ఫలితాలకు ముందు త్రిష తిరుమల పర్యటన తమిళనాట చర్చనీయాంశంగా మారింది.

# కరీంనగర్‌లో కన్నీటి దృశ్యం..

## పండ్లు అమ్మే బండే.. కొడుకు పాడెగా మారింది!

- అనారోగ్యంతో మృతిచెందిన కుమారుడు
- శవాన్ని తోపుడు బండిపై ఇంటికి తరలించిన నిరుపేద తల్లిదండ్రులు
- పండ్లు అమ్మి జీవించే కుటుంబంలో తీవ్ర విషాదం
- అంబులెన్స్ వచ్చేలోపే ప్రాణం విడిచిన యువకుడు



**కరీంనగర్ మే 4, (నినాదం):** కరీంనగర్ జిల్లాలో అత్యంత విషాదకరమైన సంఘటన వెలుగుచూసింది. కన్నకొడుకు అనారోగ్యంతో మృతిచెందగా, ఆ నిరుపేద తల్లిదండ్రులు అతడి మృతదేహాన్ని తమ తోపుడుబండిపైనే తరలించుకోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక దృశ్యం స్థానికులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళితే... శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన ఎల్కపెల్లి వీరయ్య, రుక్కమ్మ దంపతులు తోపుడుబండిపై పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు యాకూబ్ (38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

ఆదివారం సాయంత్రం యాకూబ్ ఆరోగ్యం విషమించడంతో తల్లిదండ్రులు అతడిని తమ రేకుల షెడ్డు వద్దకు తీసుకొచ్చి 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. అయితే, అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకునేసరికే యాకూబ్ ప్రాణాలు విడిచాడు. దీంతో వారు ఏమీ చేయలేక వెనుదిరిగారు. చేసేది లేక, తమ జీవనాధారమైన పండ్ల బండిపైనే కొడుకు మృతదేహాన్ని ఉంచి, ఇంటికి తరలించారు. కళ్లెదుటే జరిగిన ఈ విషాద ఘటన ను చూసిన స్థానికులు చలించిపోయారు.

# కౌంటింగ్‌కు ముందు మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు

- ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా కరెంట్ తీస్తున్నారని ఆరోపణ
- సీసీటీవీలు ఆఫ్ చేశారని, అనుమానాస్పద వాహనాలు తిరుగుతున్నాయన్న మమత
- ఇదంతా బీజేపీ కుట్రేనని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు



**కోల్‌కత్తా , మే 4 (నినాదం):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కొన్ని గంటల ముందు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఉద్దేశపూర్వకంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, సీసీటీవీలను ఆఫ్ చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో 'ఎక్స్' వేదికగా ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా కలకలం రేపింది. "వివిధ ప్రాంతాల్లో కావాలనే లోడ్ షెడ్డింగ్ చేస్తున్నట్లు నాకు సమాచారం అందుతోంది. హూగ్లీలోని సెరాంపూర్, నాడియాలోని కృష్ణానగర్, బర్ద్వాన్‌లోని ఆష్‌గ్రామ్, కోల్‌కతాలోని ఖుదీరామ్ అనుశీలన్ కేంద్రం వద్ద ఇలాంటి ఘటనలు జరిగాయి. సీసీటీవీలు ఆఫ్ చేస్తున్నారు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దకు వాహనాలు వస్తూ పోతున్నాయి" అని మమత తన పోస్టులో పేర్కొన్నారు. ఈ కుట్రల వెనుక బీజేపీ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. "నేను రాత్రంతా మేల్కొని పరిస్థితిని గమనిస్తున్నట్లే, మీరు కూడా రాత్రంతా మేల్కొని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ప్రజా తీర్పును కాపాడాలి. ఎక్కడైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిని చుట్టుముట్టండి, వెంటనే ఫిర్యాదు చేయండి, సీసీటీవీ ఫుటేజ్ డిమాండ్ చేయండి" అని తన పార్టీ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. నాలుగోసారి అధికారం కోసం పోటీ పడుతున్న మమత, ఆదివారం సాయంత్రం భవానీపూర్ నియోజకవర్గ కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు గాను మెజారిటీకి 148 సీట్లు అవసరం. ఈ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అయితే, ఐదు ఎగ్జిట్ పోల్స్ బీజేపీ విజయం సాధిస్తుందని అంచనా వేయగా, తాము 226కు పైగా సీట్లు గెలుస్తామని మమత ధీమా వ్యక్తం చేశారు.

# వివాహేతర సంబంధం..

## భార్యను హత్య చేసిన భర్త

- సోదరులతో కలిసి ఇనుప రాడ్‌తో కొట్టి చంపిన భర్త
- నిందితుడైన భర్త, అతని ఇద్దరు సోదరుల అరెస్ట్

**కృష్ణా మే 4, (నినాదం):** కృష్ణా జిల్లా పామర్రు మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కక్షతో కట్టుకున్న భార్యనే ఓ భర్త తన సోదరులతో కలిసి అతి కిరాతకంగా హత్య చేశాడు. గాంధీనగర్‌లో ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతురాలిని దిమ్మెట లక్ష్మీప్రసన్న (30)గా గుర్తించారు. ఆమెకు 13 ఏళ్ల క్రితం మీర్జాపురం గ్రామానికి చెందిన మురళీకృష్ణతో వివాహం కాగా, ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా భర్త, పిల్లలను వదిలిపెట్టిన లక్ష్మీప్రసన్న.. నిడుమోలు గ్రామానికి చెందిన అయ్యప్ప అనే వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోంది. ఈ విషయంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న భర్త మురళీకృష్ణ, ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకు న్నాడు. పథకం ప్రకారం సోమవారం ఉదయం గాంధీనగర్‌లో ఉన్న లక్ష్మీప్రసన్నపై తన ఇద్దరు సోదరులతో కలిసి ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. తలపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ హత్యకు పాల్పడిన భర్త మురళీకృష్ణతో పాటు అతనికి సహకరించిన ఇద్దరు సోదరులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన కక్షలే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# వరుస గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్




**వికారాబాద్, మే 4(నినాదం ):** గత కొంతకాలంగా వికారాబాద్, పొరుగు జిల్లాల్లో వరుసగా మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను వికారాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పర్యవేక్షణలో, పరిగి డిఎస్‌పి ఎన్. శ్రీనివాస్ ఆదేశాల మేరకు, కోడంగల్ సిఐ ఎన్. శ్రీధర్ రెడ్డి, బొమ్రాస్‌పేట్ ఎస్ ఐ జి.బి.వి. రమణల ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైమ్ పార్టీ బృందం రంగంలోకి దిగింది. ఆదివారం మఫ్టీలో ఉన్న పోలీసులు కె. బాలు, కె. బాలయ్య, శ్రీనివాస్ లు బొమ్రాస్‌పేట్ గ్రామ శివారులోనిరహదారి163 రోడ్డు వద్ద నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక తెల్లటి ఎర్టిగా కారును తనిఖీ చేయడానికి ప్రయత్నించగా, అందులోని వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులను యాదగిరి జిల్లాకు చెందిన సంజయ్ కుమార్ చవాన్ అలియాస్ సంజు (33) మరియు థానే జిల్లా (మహారాష్ట్ర)కు చెందిన జగత్ పాల్ అలియాస్ దినేష్ కుమార్ (29)గా గుర్తించారు. వీరిని బొమ్రాస్‌పేట్ పోలీసు స్టేషన్‌లో విచారించగా, వీరితో పాటు రోషన్, టైగర్ అలియాస్ తేజు, బహదూర్ అనే వ్యక్తులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. విలాసాలకు, మద్యం అలవాట్లకు బానిసైన వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అర్ధరాత్రి సమయాల్లో కారులో వచ్చి వికారాబాద్ జిల్లాలోని బొమ్రాస్‌పేట్, పరిగి, చెంగోముల్, దోమ, కుల్కచెర్ల, యాలాల్, పెద్దేముల్ మండలాలతో పాటు నారాయణపేట జిల్లాలోని మాగనూర్, మహబూబ్ నగర్ జిల్లాలోని మహమ్మదాబాద్ పరిధిలో మేకలు, గొర్రెలను దొంగలించేవారు. దొంగిలించిన జీవాలను యాదగిరిలోని షాపూర్ సంతలో విక్రయించి వచ్చిన డబ్బును పంచుకునేవారు. ఈ తరుణంలో ఆదివారం మధ్యాహ్నం తిరిగి దొంగతనం చేసేందుకు కారులో వస్తుండగా పోలీసులు వీరిని పట్టుకున్నారు. అయితే ముగ్గురు నిందితులు పారిపోగా, ప్రధాన నిందితులైన సంజయ్ కుమార్, జగత్ పాల్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నేరానికి వాడిన ఎర్టిగా కారుతో పాటు రూ. 1,50,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం వీరిపై బొమ్రాస్‌పేట్ పీఎస్ లో సి ఆర్ పీ సి నెంబర్ 34/2026 కింద 331 (4)(II), 305 బి ఎన్ ఎస్ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ ముఠాపై గతంలో చెంగోముల్ (110/2024, 29/2026), యాలాల్ (02/2025), మాగనూర్ (74/2025), కుల్కచెర్ల (138/2025, 20/2026, 28/2026), పెద్దేముల్ (181/2025), మహమ్మదాబాద్ (20/2026), పరిగి (45/2026), దోమ (55/2026) పోలీసు స్టేషన్లలో మొత్తం 12 కేసులు నమోదై ఉన్నాయి. పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, పోలీస్ అధికారులు తెలిపారు. ఈ కేసులో పని చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ అభినందించారు.

# హర్మూజ్ జలసంధిలో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'.. అమెరికా భారీ ఆపరేషన్


- చిక్కుకున్న విదేశీ నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడమే లక్ష్యం
- ఇది మానవతా చర్య అని, అడ్డుకుంటే తీవ్రంగా స్పందిస్తామని ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్‌తో సానుకూల చర్చలు జరుగుతున్నాయన్న ట్రంప్
- అమెరికా చర్య కాల్పుల విరమణ ఉల్లంఘనేనని ఇరాన్ స్పష్టీకరణ




**న్యూయార్క్, మే 4 (నినాదం) :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న విదేశీ వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించారు. సోమవారం ఉదయం ఈ ఆపరేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ట్రూత్ సోషల్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించిన ట్రంప్ ఈ వివాదంతో ఏమాత్రం సంబంధం లేని అనేక దేశాల నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని పేర్కొన్నారు. వారిని 'అమాయక బాధితులు'గా అభివర్ణించారు. ఆ నౌకల్లోని సిబ్బంది వద్ద ఆహారం, నిత్యావసరాలు అడుగంటుతున్నాయని, ఇది పూర్తిగా మానవతా దృక్పథంతో చేపడుతున్న చర్య అని వివరించారు. ఈ ఆపరేషన్‌కు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పూర్తి మద్దతు ప్రకటించింది. గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లు, 100కు పైగా విమానాలు, 15,000 మంది సైనికులు ఇందులో పాల్గొంటారని తెలిపింది. ఇదే సమయంలో, ఈ మానవతా సహాయక చర్యలకు ఎవరైనా అడ్డుతగిలితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. మరోవైపు, ఇరాన్‌తో తమ ప్రతినిధులు చాలా సానుకూల చర్చలు జరుపుతున్నారని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. అయితే, కొన్ని రోజుల క్రితమే ఇరాన్ ప్రతిపాదించిన 14-సూత్రాల శాంతి ప్రణాళికను ట్రంప్ 'ఆమోదయోగ్యం కాదు' అని తోసిపుచ్చారు. తాజా పరిణామాలపై స్పందించిన ఇరాన్, హర్మూజ్ జలసంధిలో అమెరికా జోక్యాన్ని కాల్పుల విరమణ ఉల్లంఘనగా పరిగణిస్తామని హెచ్చరించింది.

# పెళ్లికి వెళుతుండగా వరుడిని కాల్చి చంపిన దుండగులు

- ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో ఘటన






**జౌన్‌పూర్ మే 4, (నినాదం):** పెళ్లి వేడుకలతో కళకళలాడాల్సిన ఓ ఇంట్లో పెను విషాదం నెలకొంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడిని, ఊరేగింపుగా వెళ్తుండగా దుండగులు నడిరోడ్డుపై కాల్చి చంపారు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పెళ్లికి రెండు రోజుల ముందే తమకు బెదిరింపులు వచ్చాయని, అయినా తాము వాటిని తేలికగా తీసుకున్నామని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆజాద్ బింద్ అనే యువకుడికి వివాహం నిశ్చయమైంది. శుక్రవారం సాయంత్రం పూలతో అలంకరించిన కారులో బంధువులతో కలిసి పెళ్లి మండపానికి బయలుదేరాడు. వారి నివాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారి 135-ూా పై ప్రయాణిస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు కారును అడ్డగించారు. నెంబర్ ప్లేట్‌కు గుడ్డ కట్టి ఉన్న బైక్ పై వచ్చిన మాస్కులు ధరించిన నిందితులు వెంటనే ఆజాద్‌పై కాల్పులు జరిపి పరారయ్యారు. కాల్పులు జరగడంతో కారులో ఉన్నవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బుల్లెట్ గాయాలతో ఉన్న ఆజాద్ "నేను బతకలేను" అంటూ చెప్పిన మాటలను గుర్తుచేసుకుని కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి, అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆజాద్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ హత్య వెనుక వధువు తరపు బంధువుల హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వధువు బంధువైన ప్రదీప్ బింద్‌కు ఈ పెళ్లి ఇష్టం లేదని, ఈ కారణంగానే అతను రవి యాదవ్, భోలే రాజ్‌భర్‌లతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. పెళ్లికి ముందు ప్రదీప్ తమను బెదిరించినట్లు వధువు కూడా విచారణలో అంగీకరించింది. నిందితుడు ప్రదీప్‌కు నేరచరిత్ర ఉందని, గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉండి బెయిల్‌పై బయట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.25,000 రివార్డును పోలీసులు ప్రకటించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.